
# గోల్డ్ రింగ్! ఉంగరం!



**టెంపోరావ్**

సాయంత్రం అయిదయింది. రామ్మూర్తి ఆఫీసులోంచి బయటికొచ్చాడు.

బస్టాప్ వైపు మెల్లిగా నడిచాడు. బస్టాప్ జనంతో కిక్కిరిసి వుంది. తనెక్కవలసిన బస్సులు రెండు వచ్చి ఆగకుండా వెళ్ళిపోయాయి. ఆకలేస్తోంది. **అతను** కోటు కుడి జేబును వేళ్ళతో వెతికాడు. ఉలిక్కిపడ్డాడు. అందులో పడేసిన చిల్లర ఏమయింది? మళ్ళా జేబులోకి వేళ్ళను పోనిచ్చాడు. జేబుకి చిల్లుందని గ్రహించాడు. ఆ చిల్లులోంచి చిల్లర డబ్బులు ఎక్కడో పడిపోయి వుంటాయి.

ఇప్పుడు తను బస్టాప్ దగ్గర నిలబడి లాభంలేదు. రామ్మూర్తి నలువైపులా చూశాడు. తనకు తెలిసిన ముఖాలు ఎక్కడా కనపడలేదు. ఇంటికి నడిచిపోవాలి. అతను రోడ్డమ్మట మెల్లిగా నడవసాగాడు. మరో నాలుగు రోజులు పోతేగాని చేతికి జీతం రాదు. ఇంటికెళ్ళగానే తను భార్యకిచ్చి కోటు జేబును కుట్టమనాలి. అతని మెదడులో ఏవేవో ఆలోచనలు సాగుతున్నాయి. రాజమోహన్ చాలా కేసుల్లో గత పదేళ్ల

నుంచీ అతను గుమస్తాగా పనిచేస్తున్నాడు. సంవత్సరానికి పదిరూపాయలు ఇంక్రిమెంట్ వస్తుంది, ఇప్పుడతనికి రెండొందలయాభై రూపాయలు వస్తోంది.

రామ్మూర్తి తనభార్య లక్ష్మిని గురించి ఆలోచించ సాగాడు. వెనుకనించి ఏదో కారు హారన్ వినిపించింది. అతను కారువైపు చూశాడు. తెలిసిన వాళ్ళెవరేనా కార్లో వుంటే తనకు లిఫ్ట్ దొరుకుతుంది. 'వైట్ పాంట్. చారలస్లాక్ ధరించిన యువకుడు కారును రాష్‌గా తోలుకుపోతున్నాడు.

రామ్మూర్తి కోడంబాకం పోస్టాఫీసు దాటి వంతెనవైపు నడుస్తున్నాడు, చటుక్కున కాలికి ఏదో తగిలి ఆగాడు. నేల మీద తళతళ మెరుస్తూన్న ఉంగరం అతనికి కనిపించింది. వంగి దాన్ని తీసుకున్నాడు. దానివైపు పరీక్షగా చూశాడు. ఇది గోల్డ్‌కోటెడ్ ఉంగరం కాదనిపిస్తోంది. బరువుగాకూడా వుంది. ఈ బంగారపు ఉంగరాన్ని ఎవరో పోగొట్టుకుని వుండాలి. అతను వంతెన ఎక్కి దిగాడు. రోడ్డువారగా వున్న ఒక నేమ్‌బోర్డు వైపు చూశాడు. పరమానంద్ జైన్, పాన్ బ్రోకర్. ఆ షాపులో ప్రవేశించి పరుపు మీద కూర్చున్న జైన్‌కి ఉంగరాన్ని అందించాడు. ఉంగరాన్ని పరిశీలించి. "దీని మీద 50 రూపాయలు యిస్తాం," అన్నాడు జైన్.

"అమ్మేస్తాను." అన్నాడు రామ్మూర్తి,

"ఎనభై రూపాయలు యిస్తాను."

రామ్మూర్తి ఒక పత్రంమీద సంతకం పెట్టాడు. ఎనభై రూపాయలు తీసుకుని చిల్లు లేని జేబులో పడేసుకున్నాడు. ఉషారుగా రోడ్డమ్మట నడవసాగాడు.

అతని మెదడులో ఆలోచనలు చేపల్లా ఈదుతున్నాయి. తను మంచి జోళ్ళు కొనుక్కోవాలి. భార్యలక్ష్మి అతనికి గుర్తుకి వచ్చింది. ఆమెకు జాకట్లులేవు ఉన్న రెండు మూడు జాకట్లూ అనేకచోట్ల చిరిగితే కుట్టుకుని అలాగే ధరిస్తోంది. ఆమెకు జాకట్టు గుడ్డలు కొనాలి, అతని ఆరుగురు పిల్లలూ జ్ఞప్తికొచ్చారు. ప్రతిరోజూ ఏవేవో కావాలని వాళ్ళు అడుగుతున్నారు. శీతం వచ్చాక చూద్దాం అని అతను జరిపిస్తున్నాడు. పెద్దకూతురు వనజ పెన్ కావాలంది. కాలేజీలో ఆమె పి. యు. సి చదువుతోంది. కొడుకు రాజు టిఫిన్‌బాక్స్ కొని పెట్టమన్నాడు. మరోకూతురు నళిని గౌనుగుడ్డ కొనమంది. ఈ డబ్బుతో తను అందరి కోర్కెలనూ తీర్చాలి.

రామ్మూర్తి ఆలోచిస్తూ ఒక జోళ్ళ షాపులోకి దూరాడు. కొత్తజోళ్ళు కొనుక్కుని పాకెట్ చేత్తో పట్టుకుని బయటకు వచ్చాడు. చీకటి పడింది. రోడ్డు దీపాలు వెలుగుతున్నాయి. అతను బస్సెపట్లో పాండీబజారు చేరుకున్నాడు. బజారు కిటకిట్లాడుతోంది. షాపుల్లో ఫ్లోరసెంట్‌ట్యూబులు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. అతనొక హోటల్లో ప్రవేశించాడు. ఆకలి తీరిందాకా టిఫిన్ తిన్నాడు. వేడి వేడి కాఫీ తాగి బయటకొచ్చాడు. పక్కనే సిగరేట్ షాపుంది. ఒక్కసిగరేట్‌కొని వెలిగించి పొగ పీలుస్తూ ఇటూ అటూ చూశాడు. ఎదురుగా ఒక టేబుల్ మీద లాటరీ టిక్కెట్లుపరిచి వున్నాయి. అందవిహీనంగా వున్న ఒకస్త్రీ అతనివైపు నవ్వుతూ చూపింది.

"హర్యానా, పంజాబ్ రేపే డ్రా,

సార్," అందామె. ఎన్నిసార్లో అతను లాట్రీ టిక్కట్లు కొన్నాడు, కాని అదృష్టం రాలేదు, రామ్మూర్తి రెండురూపాయలిచ్చి లాట్రీ టిక్కట్లు కొని జేబులో పడేసుకున్నాడు. అనుకోకుండా తనకు దైవం ఎనభై రూపాయలిచ్చాడు. ఇవాళ అదృష్టం తనని వరించింది. ఈ లాట్రీ టిక్కట్లు నెగ్గితే తనొక లక్షాధికారి అవుతాడు!

రామ్మూర్తి ఆలోచిస్తూ పేవ్‌మెంట మ్మట నడుస్తున్నాడు. పెద్దబట్టలషాపు కనిపించింది. అందులోకి ఉత్సాహంగా దూరాడు. తన భార్యకి చీర, జాకట్టుగుడ్డ కొన్నాడు. పిల్లలందరకూ ఏవేవో తీసుకున్నాడు. షాపులోంచి బయటకొచ్చాడు. కొంచెం దూరం నడిచేసరికి పెన్నులు అమ్ముతున్న ఒక వ్యక్తి అగుపించాడు. అతను తన కూతురు వనజ కోసం ఒక పెన్ను కొన్నాడు. మరికొంత దూరం నడిచాడు. తన చేతులో చాలా పాకెట్లున్నాయి. ఒక ఫాన్సీషాపు వైపు వెళ్ళాడు. ప్లాస్టిక్ బాగ్ కొన్నాడు. అందులో పాకెట్లన్నీ పెట్టుకుని ఉషారుగా బస్టాప్ చేరుకున్నాడు. అందరికీ అన్నీ కొనగా తన జేబులో ఇంకా పదిరూపాయలు, కొంత చిల్లర మిగిలింది.

బస్సు రాగానే అతను ఎక్కాడు. సీటు మీద కూర్చుని బజారు షాపులవైపు చూడసాగాడు. బస్సు కదిలింది. అతని మెదడులో ఆలోచనలు మెదుల్తున్నాయి. తన చేతిలోని బాగ్‌ను చూడగానే అందరూ ఏమిటని అడుగుతారు, జీతం వచ్చేముందే ఇవన్నీ కొని పట్టుకొచ్చినందుకు సంతోషిస్తారు. ఆల్వార్‌పేట ప్రాతంలో రామ్మూర్తి బస్సులోంచి దిగాడు. తన యింటివైపు గబగబా అడుగు లేశాడు.

ముందు గదిలోకి అడుగుపెట్టి పేమ్ కుర్చీలో కూర్చున్నాడు. పక్కగదిలోంచి రేడియో నాటకం వినిపిస్తోంది. పిల్లలందరూ రేడియో చుట్టూ గుమికూడి వుండాలి. వంటింట్లోంచి లక్ష్మి ముందు గదిలోకి వచ్చింది. అతని వైపు నవ్వుతూచూపింది.

"ఇవాళ చాలా ఆలస్యంగా వచ్చారు!" అందామె.

"బస్సు దొరకలేదు"

"ఆ బాగ్‌లో ఏముంది?"

అతను జవాబివ్వలేదు, నవ్వి ఊరుకున్నాడు.

"ఉండండి, టిఫిన్ తెస్తాను,"

ఆమె వంటింట్లోకి వెళ్ళిపోయింది. కాస్సేపట్లో ఉప్మాతెచ్చి అతని కందించింది.

"ఆకలి లేదు. నేను హోటల్లో తిన్నాను. పిల్లలకి కావలిస్తే ఇచ్చేయి," అన్నాడతను, ఆమె అందించిన కాఫీ గ్లాసును తీసుకున్నాడు, కాఫీతాగి మూతి తుడుచుకున్నాడు.

పక్కగదిలోంచి వనజ బయటకొచ్చింది. ఆమెవైపు అతను నవ్వుతూ చూశాడు.


"అదేమిటండీ?"అడిగింది భార్యమళ్ళా.

రామ్మూర్తి బాగ్‌ను భార్య కందించాడు. రేడియో నాటకం పూర్తిఅయింది. పిల్లలందరూ గదిలోకొచ్చారు.

"ఆ పెన్ను వనజకు", అన్నాడతను.

"ఆ చీర, జాకట్టుగుడ్డ నీకు!" అన్నాడు భార్యతో.

పిల్లలు కొన్ని వస్తువుల్ని తీసుకుని ఆనందంతో గెంతులు వేస్తున్నారు. రామ్మూర్తి కాళ్లు చాచుకుని కుర్చీలోవెనక్కివాలాడు. దగ్గరగా వచ్చిన వనజవైపు




నవ్వుతూ చూశాడు. ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

"పెన్ను కొనిస్తే ఏడుస్తున్నా వేమిటమ్మా?" అన్నాడు. రామ్మూర్తి.

"నాన్నా, నీకొకటి చెప్పాలి."

"ఏమిటది?"

"ఇవాళ కాలేజీనుంచి కోడంబాకం పోస్టాఫీసు పక్కనున్న నా స్నేహితురాలింటికి వెళ్ళాను. నా వుంగరం ఎక్కడో పడిపోయింది నాన్నా!" అంది వనజ.

రామ్మూర్తి నోటమ్మట మాట రాలేదు. అతను కూతురువైపు ఆశ్చర్యంగా చూశాడు. పోస్టాఫీసు ప్రాంతంలోనే తనకీ వుంగరం దొరికింది.

"ఇవన్నీ ఎలా కొన్నారు? డబ్బెక్కడిది?" అడిగింది లక్ష్మి. రామ్మూర్తి క్షణకాలం భార్యనీ కూతుర్నీ చూస్తూ వుండిపోయాడు.

"వనజా. వుంగరం పోయిందని బెంగపెట్టుకోకు, నేను అదేతోవమ్మట వస్తొంటె ఆ వుంగరం నాకు దొరికింది."

వనజ కళ్ళు నక్షత్రాల్లా మెరిశాయి. తల్లివైపు సంతోషంగా చూపింది.

"ఎంత అదృష్టవంతులం!" అంది వనజ.

రామ్మూర్తి సూటిగా కూతురువైపు చూశాడు.

"అమ్మాయ్, నీవుంగరం నా జేబులో లేదు" అది నీదని నేను పోల్చలేదు. దాన్ని అమ్మేసి ఇవన్నీ కొనితెచ్చాను!"

వనజ కాస్సేపు నిశ్శబ్దంగా నిలబడింది.

"మన వుంగరం మరో రూపంలో మనకు దక్కింది," అందామె నవ్వుతూ.